# కూలిన సౌధం


— గౌతం అన్నాల

ఉదయం ఆరుగంటలు. ఇంకా
ఆ మహానగరం మేల్కొనలేదు.
ఎందుకంటే అది నిద్రపోయేదే
రాత్రి ఒంటిగంటకి.
కాని ఆ మహానగరానికి తూర్పున రెండు
కిలోమీటర్లదూరంలో విసిరివేయబడ్డట్లు గల
శంభాజీపేట మాత్రం అప్పుడే లేచింది. నగరం
డాబుకు, దర్పానికి మారుపేరైతే
ఈ పేట నిర్లక్ష్యానికి, నిరాశకి నిదర్శనం.

గుడిసె పైకప్పుకి గల రంధ్రాల్లోంచి ఎండ పొడ మొహం మీద పడడంతో మెలకువ వచ్చింది సోమరాజుకి. ఏభై ఏళ్ళ శరీరం లేవడానికి ససేమిరా ఒప్పుకోక పోవడంతో అలాగే పడుకున్నాడు. రాత్రి విమలా టాకీసు దగ్గర మంచి బేరం దొరికింది సోమరాజుకి. టాకీసు నుండి దుర్గపురం వరకు తీసుకెళ్ళినందుకు ఇరవై రూపాయ లిచ్చాడు ఓ పెద్దమనిషి. ఆ వయసులో అంత దూరం రిక్షా లాగినందుకేమో అసలు లేవనంటున్నది శరీరం. గుడిసె బయట జరిగే చప్పుళ్ళని బట్టి చాలా పొద్దుపోయిం దని గ్రహించాడు సోమరాజు.

ఒంట్లో ఓపిక తెచ్చుకొని లేచి బట్టలు సర్దుతూ పాకలో ఒక పక్కకి చూసి నిట్టూర్చాడు సోమరాజు. ఆ మూల ఖాళీగా కనిపించింది. వీడు రాత్రి కూడా ఇంటికి రానట్టుంది. 'ఒక్కగానొక్క కొడుకు. ఎదిగి నన్నేదో ఉద్ధరిస్తాడని కళ్ళలో పెట్టుకొని పెంచాను. ఏం లాభం? నా ఖర్మ' గొణుక్కుంటూ చీపురు తీశాడు సోమరాజు పాక శుభ్రం చేద్దామని.

అరగంటలో పాక శుభ్రం చేసి, రిక్షాకు ఆయిల్ వేసి నోట్లో పుల్ల వేసుకొని బోరింగు కేసి నడిచాడు. మున్సిపాలిటీ వాళ్ళు శంభాజీపేట మొత్తానికి నీళ్ళు అందించేందుకు ఒక వాటర్ టాంకు వేశారు. దాని ప్రక్కనే నాలుగు నల్లాలు అమర్చి రోజూ ఉదయం సాయంత్రం రెండు మూడు గంటలు నీళ్ళు వదుల్తారు. పేట మొత్తానికి అదొక్కటే కాబట్టి ప్రతి రోజు అక్కడ జరిగేవి ముష్టియుద్ధాలే. ఆ ప్రదేశంలోనే ఒక సెలూన్, టైలరింగ్ షాపు, సైకిల్ షాపు కూడా ఉండటంతో ఆ ప్రదేశం కాస్తా బోరింగ్ సెంటర్‌గా మారింది. సోమరాజు అక్కడికి చేరేసరికే చాలామంది పోగయ్యారు. ఆడవాళ్ళ జగడాలు, పిల్లల స్నానాలతో ఆ ప్రదేశం మాత్రం అంతా బిజీగా ఉంది. ఎప్పటి మాదిరిగానే ఓ మూల నిలబడి పళ్ళు తోమడంలో నిమగ్నమయ్యాడు సోమరాజు.



అక్కడ వున్న సెలూన్‌లోకి వచ్చే న్యూస్‌పేపర్ చాలామంది మగవాళ్ళను అక్కడికి రప్పిస్తుంది. మొత్తానికి ఆ బోరింగ్ సెంటర్ ఆ పేటకు రచ్చబండలాంటిది. ఇంతలో రాత్రి పేటలో ఏదో గొడవ జరిగిందని, పోలీసులు కూడా వచ్చారనే వార్త సెంటర్‌లో గుప్పుమంది. ఆ పేటలో గొడవలు, దొమ్మీలు మామూలు కావడంతో సోమరాజు పెద్దగా పట్టించుకోలేదు. ఇరవై నిమిషాల సేపు స్నానం పూర్తి కావించి గుడిసెవైపు దారితీశాడు సోమరాజు.

అప్పటికే చాలా లేటయిపోవడంతో గబగబా అడుగులు వేస్తూ గుడిసెను సమీపించాడు. దూరం నుండే తన పాక ముందు నలుగురైదుగురు నిలబడి ఉండటం చూశాడు సోమరాజు. బహుశా యాద్గిరి కోసం వచ్చి ఉంటారు. మళ్లేం చేశాడో వీడు. ఆ వీర్రాజు గాడితో తిరగొద్దని ఎంత చెప్పినా వినడు కదా! అనుకున్నాడు. ఆ నల్గురిలో రాంబాబు కూడా ఉన్నాడు. రాంబాబు యాద్గిరికి బాల్యస్నేహం. ఒక పేటలో కలిసి తిరిగారు. రాంబాబు ముఖంలో ఆందోళన గమనించి గాబరా పడ్డాడు సోమరాజు. 'బాబాయి రాత్రి వీర్రాజు మీదికి బస్తీ మనుషులు దాడి చేశారు. వీర్రాజు ఎలాగోలా వారికి దొరకకుండా తప్పించుకున్నాడు. దాంతో వారు కోపంతో అక్కడ దొరికిన వాళ్ళందరినీ గొడ్డళ్ళతో నరికారు. అందులో... అందులో మన యాద్గిరి కూడా ఉన్నాడు' చెబుతున్నాడు రాంబాబు.

కాలి కింద భూమి కదిలినట్టయింది సోమరాజుకి. రాంబాబు చెప్తున్న మిగిలిన మాటలేవీ అతనికి వినిపించడం లేదు. అతని మాటల్ని మధ్యలో ఆపి అడిగాడు ''యాద్గిరికి ఏమైంది?. అసలు వాడు ఎట్లున్నడు?''

''బస్తీకి తీస్కపోయి సర్కారు దవాఖాన్ల వేశారట గంతే. అంతకు మించి ఏం తెల్వదు. రా... బాబాయి తొందరగా పోదాం'' అన్నాడు రాంబాబు.

గబగబా రిక్షా తీసి బస్తీకేసి సాగాడు సోమరాజు. అతని కళ్ళలో ఆందోళన, బాధ, భయం. యాద్గిరి ముఖమే అతని కళ్ళకి కనబడ్తుంది. కళ్ళ నిండిన నీటి పొరలను తుడుచుకుంటూ గబగబా తొక్కడం మొదలుపెట్టాడు. యాద్గిరికి ఏడేళ్ళుంటాయేమో అపుడు సచ్చిపోయింది వాడి అమ్మ. పేదోళ్ళ మనసు, దానికుండే బంధాలు గట్టివేమో మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు సోమరాజు. యాద్గిరి వాళ్ళ అమ్మకి వాడంటే ప్రాణం. మళ్ళీ పెళ్ళి చేసుకొంటే సవతి తల్లి పెట్టే బాధలు స్వర్గంలో ఉన్న అది భరించదని మళ్ళీ పెళ్ళి చేసుకొనే ఆలోచనను తుడిచేశాడు సోమరాజు.

సోమరాజు గుండె చాలా వేగంగా కొట్టుకుంటోంది. అంతకంటె వేగంతో తొక్కుతున్నాడు రిక్షాని. అతని మనసు పరిపరి విధాలుగా పోతోంది. యాద్గిరికి సదువు అబ్బలేదు. అయినా బాధపడలేదు తను. మొదటిసారి వాడు సినిమాకు డబ్బులు అడిగినపుడు రిక్షా గంట ఎక్కువ నడిపాడు. మొదటిసారి ప్యాంటు, షర్టు కావాలి అంటే ఉదయం పూట బస్టాండ్ స్టాల్‌లో టిఫిన్ నెలరోజులు మానివేశాడు. ఏనాడూ తన కోసం ఆలోచించలేదు. వాడి కోసం బతికాడు. ఇప్పుడిలా కావడంతో భరించలేక పోతున్నాడు. అసలా వీర్రాజుతో తిరుగొద్దని ఎన్నిసార్లు చెప్పాడు. శంభాజీపేట యువకులంతా కలిసి ఏదో సంఘం పెట్టారని, పేటను బాగు చేస్తారని తెలిసినప్పుడు తన కొడుకు ప్రయోజకుడు అయ్యాడని పొంగి పోయాడు. ఆ సంఘంలో వీర్రాజు చేరడంతో ఇదంతా మొదలయ్యింది. వాడో జులాయి. ఎవిడతో ఒకడితో పోట్లాటకు దిగందే వాడికి పొద్దు పోదు. రకరకాల ఆలోచనలు మదిని కలవరపెడుతుండగా సిటీలోకి ప్రవేశించింది సోమరాజు రిక్షా.

''ప్రమాదం ఏమీ
లేదు కదా'' నోట మాట
సరిగా రావటం లేదు
సోమరాజుకి. ''రక్తం బాగా
పోయింది. వెంటనే రక్తం
ఎక్కించకపోతే యాద్గిరి
మనకు దక్కడు. యాద్గిరికి
కావల్సిన రక్తం హాస్పిటల్‌లో
లేదట. ఏ రక్తం కావాలో
డాక్టర్ రాసిచ్చిండు.
వెంటనే తేవాలి''

ప్రభుత్వాసుపత్రికి చేరాలంటే ఇంకా చాలా దూరం పోవాలి. సిటీలో ఆ రోజు బంద్. షాపులన్నీ మూసి ఉన్నాయి. స్కూళ్ళయితే ముందు రోజే సెలవు ప్రకటించాయి. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీ చేపట్టిన బంద్ అది. బంద్ విఫలమయితే తమ ప్రతిష్ఠకు భంగం అని పాలకపక్షం వారు బంద్ విఫలం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అయినప్పటికీ బజార్లన్నీ నిర్మానుష్యంగానే ఉన్నాయి. సిటీ బస్సులు కూడా నడవడం లేదు.

ప్రభుత్వాసుపత్రిని చేరేసరికి రాంబాబు హాస్పిటల్ ఆవరణలో ఎవరితోనో మాట్లాడుతూ కన్పించాడు. అతనేకాక మరో ఐదారుగురు పేట మనుషులు కూడా ఉన్నారు. సోమరాజుని చూడగానే రాంబాబు గబగబ అతని వద్దకు వచ్చాడు. ''బాబాయ్... యాద్గిరికి రక్తం బాగా పోయిందట. డాక్టర్ లోపల యాద్గిరిని చూస్తాండు. ఇంకా ఏమీ చెప్పలేదు'' అంటూ మళ్ళీ లోపలికి వెళ్ళాడు. సోమరాజు లోపలికి వెళ్ళబోయాడు. కానీ వెళ్ళనీయలేదు. లోపల రాంబాబు డాక్టర్‌తో మాట్లాడుతూ కన్పించాడు. రాంబాబు ముఖంలో ఆదుర్దా, భయం కన్పించింది. ''దేవుడా! నా కొడుకును కాపాడు'' అప్రయత్నంగా వేడుకొన్నాడు సోమరాజు.

కొన్ని నిమిషాల తర్వాత రాంబాబు వచ్చాడు. ''ప్రమాదం ఏమీ లేదు కదా'' నోట మాట సరిగా రావటం లేదు సోమరాజుకి. ''రక్తం బాగా పోయింది. వెంటనే రక్తం ఎక్కించకపోతే యాద్గిరి మనకు దక్కడు. యాద్గిరికి కావల్సిన రక్తం హాస్పిటల్‌లో లేదట. ఏ రక్తం కావాలో డాక్టర్ రాసిచ్చిండు. వెంటనే తేవాలి'' అన్నాడు రాంబాబు.

సోమరాజుకి ఏం చేయాలో తోచలేదు. రాంబాబును తీసుకొని తన రిక్షా దగ్గరికి వెళ్ళి ''బాబు... వెంటనే అయిలాపూర్‌కి వెళ్ళి అందరికీ రిక్షాలు కిరాయికి ఇచ్చే రాంనర్సు దగ్గరకెళ్ళి మన రిక్షా అమ్మేసి రక్తం తీస్కరా వెళ్ళు'' అన్నాడు. అసలే ఈ రోజు బంద్. రాంనర్సు అసలు తన సెంటర్‌కు వస్తాడో రాడో. రక్తం బాంకుకి పోవాలంటే అయిలాపూర్ నుండి టీవీ టవర్ దాకా పోవాలి. బస్సులు కూడా లేవాయె - తన ఆలోచనలను సోమరాజుకి చెప్పడం ఇష్టం లేక రిక్షా తీసుకొని క్షణంలో మాయమయ్యాడు రాం బాబు. హాస్పిటల్‌లోకి వెళ్ళి స్పృహలో లేని యాద్గిరిని చూసి తట్టుకోలేక పోయాడు సోమరాజు. బయట చెట్టు కింద కూర్చుని చిన్న పిల్లాడిలా ఏడ్వసాగాడు. కొందరు పేట మనుషులు ఓదార్చినట్టుగా పలకరించారు. క్షణమొక యుగంలా గడుస్తోంది. మాటిమాటికీ గేటు వైపు రాంబాబు కోసం చూస్తున్నాడు.

బస్సులు బంద్ కావటం వల్ల ఆసుపత్రి సిబ్బంది ఇంకా రాలేదు. రసి కారుతున్న బ్రతుకు పుండుపై వాలే ఈగల్లాంటి ఈ రాజకీయ బంద్‌లు నాగరికతా డవిలో మనుషుల రక్తం పీలుస్తున్నాయి. బయట అంతా గోలగా ఉంది. షాపులు మూసేయమని కొందరు బెదిరిస్తున్నారు. ఎదిరిస్తే చావగొట్టి షెట్టర్లు మూస్తున్నారు. చివరకు హాస్పిటల్ ముందున్న మందుల షాపును కూడా వదలలేదు. వాళ్ళు వెళ్ళిన తర్వాత ఎగస్పార్టీ వాళ్ళు వచ్చి షాపు ఎందుకు మూసేసారని గొడవ. ఇరుపక్షాలు బంద్‌ను సవాలుగా తీసుకోవడంతో సిటీ అంతా ఉద్రిక్తత.

ఈ పరిస్థితిలో ఆసుపత్రి లోపల సోమరాజు రాంబాబు కోసం ఎదురుచూస్తున్నాడు. దాదాపు రెండు గంటల తర్వాత రక్తం సీసాలతో రొప్పుతూ వచ్చాడు రాంబాబు. ''రాంనర్సు దొరకలేదు బాబాయ్. ఎలాగోలా వాడి ఇంటికి వెళ్ళి డబ్బు అడిగి అక్కడి నుండి కిరాయి సైకిల్ మీద టీవీ టవర్ పోయేసరికి లేటయింది. రక్తం బాంకులో కూడా ఎవరూ లేకపోవడంతో రక్తం తేవడం కష్టమయింది'' అంటూ హాస్పిటల్‌లోకి పరుగెత్తాడు.

ఎన్నో ఏళ్ళుగా తనను బతికించిన రిక్షా పోయిందన్న బాధ సోమరాజుకి లేదు. తన యాద్గిరి శరీరంలోకి ఎక్కుతున్న రక్తాన్ని చూసి అన్ని బాధలను మర్చిపోయాడు. అరగంటలో రక్తం అంతా ఎక్కింది. మరో గంటలో స్పృహ వస్తుందని డాక్టర్ చెప్పడంతో వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లయింది సోమరాజుకి.

ఇంతలో రెండు మూడు జీపులు వేగంగా ఆసుపత్రి ఆవరణలోకి దూసుకొచ్చి ఆగాయి. వాటిలోంచి కొందరు గబగబా ఆసుపత్రి లోపలికి పరుగెత్తి స్ట్రెచర్ తెచ్చి విపరీతమైన గాయాలతో రక్తం కారుతున్న ఒక యువకుడ్ని హాస్పిటల్ లోపలికి తీసుకెళ్ళారు.

ఆ యువకులు వేసుకొన్న బట్టలను బట్టి, ప్రతిపక్షం పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేయడాన్ని బట్టి వారు పాలకపక్షం వారని అర్థమయింది. విషయం తెలుసుకోవడానికి వెళ్ళిన రాంబాబు తిరిగొచ్చి అసలు విషయం చెప్పాడు సోమరాజుకి. ఎమ్మెల్యే వర్గానికి, ప్రతిపక్షం వారికి పెద్దగా గొడవ జరిగిందట. ఆ గొడవలో ఎమ్మెల్యే గారబ్బాయిని కత్తులతో పొడిచారట. ప్రైవేట్ హాస్పిటళ్ళు బంద్ ఉండటంతో ఇక్కడికి తీసుకొచ్చారు.

ఇంతలో ఒక మారుతీ కారు వచ్చింది. అందులోంచి ఒక పెద్దాయన దిగాడు. ఆయనెవరో కాదు. ఆసుపత్రి సూపరింటెండెంట్ మనోహర్‌రావు. ఆయన కారు దిగగానే అందరూ ఆయన్ను చుట్టుముట్టారు. బహుశా తమ ప్రియతమ నాయకుడి కొడుకును బతికించమని అడుగుతున్నాడు కాబోలు.

మరో ఐదు నిమిషాల్లో ఒక విదేశీ కారు వచ్చింది. అందులోని ఎమ్మెల్యేగారు, ఆయనతోపాటు ఇద్దరు గన్‌మాన్‌లు కారులోంచి దిగి గబగబా హాస్పిటల్‌లోనికి వెళ్ళారు. అక్కడే ఒక మూలకు నిలబడి వున్న సోమరాజుకి ఇదంతా పట్టడంలేదు. ఆయన ఇంకా యాద్గిరి గురించే ఆలోచిస్తూ ఉన్నాడు.

లోపల ఎమ్మెల్యే గారబ్బాయికి చికిత్స జరుగుతుంది. మనోహర్‌రావు ఆందోళనగా రెండు మూడుసార్లు బయటికి వచ్చి ఏదో మాట్లాడి లోపలికి వెళ్ళాడు. దాదాపు ఒక గంట తర్వాత హాస్పిటల్ వార్డ్‌బోయ్ గబగబా సోమరాజు, రాంబాబు వద్దకు వచ్చి ''రక్తం తొందరగా తెమ్మంటే తేలేదు. ఏం లాభం. అప్పటికే కోమాలోకి వెళ్ళిపోయాడు. మీరు తెచ్చిన రక్తం ఎక్కించినా లాభం లేకపోయింది. వచ్చి శవాన్ని తీసుకెళ్ళండి'' చెప్పుకుంటూ పోతున్నాడు. సోమరాజు కుప్పలా కూలిపోయాడు. రాంబాబు భోరున విలపించసాగాడు.

ఇంతలో ఎమ్మెల్యే గారబ్బాయికి ప్రమాదం తప్పిందని తెలవడంతో కార్యకర్తలు పెద్దఎత్తున అరుస్తూ, తమ ఆనందాన్ని ప్రకటిస్తున్నారు. కుంకుమ చల్లుకుంటున్నారు. తమ ప్రియతమ యువ నాయకుడు బతికినందుకు ఊరేగింపుగా వెళ్ళేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

సోమరాజు నిశ్శబ్దంగా యాద్గిరికేసే చూస్తున్నాడు. రాంబాబు జరిగినదాన్ని నమ్మలేకపోతున్నాడు. రక్తాన్ని త్వరగా తేనందుకు తనను తాను తిట్టుకుంటున్నాడు. గంటలో స్పృహ వస్తుందని డాక్టర్ చెప్పినా ఇలా ఎందుకు జరిగిందో అతనికి అర్థం కావడం లేదు. తాను రక్తం సమయానికి తేనందుకు యాద్గిరి చావలేదని, యాద్గిరి శరీరంలోకి ఎక్కిన రక్తం మళ్ళీ బయటికి వచ్చిందని, ఎమ్మెల్యే గారబ్బాయి శరీరంలోకి వెళ్ళిందని అతనికి తెలియదు. అవును, ప్రాణంలేని సీసాల్లోంచి రక్తం మనిషి శరీరంలోకి పోతుందనే విషయం మాత్రమే రాంబాబుకు తెలుసు కానీ డబ్బు, అధికారంగల ఎమ్మెల్యే గారబ్బాయి శరీరం ముందు యాద్గిరి లాంటి సామాన్యుడి శరీరం ప్రాణంలేని రక్తపు సీసా వంటిదేనని రాంబాబుకు తెలియదు.

లోపల మనోహరరావు వికృతంగా నవ్వుతున్నాడు. ఈ దెబ్బతో తను ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్న ప్రమోషన్ ఖాయం అనే సంతోషం ఆ నవ్వులో కనబడ్తోంది. కొంతసేపటికి ఎంతోమందిని తన రిక్షాలో గమ్యం చేర్చిన సోమరాజు కాళ్ళు ఈసారి తన సొంత కొడుకును అతని చివరి గమ్యం చేర్చడానికి స్మశానం వైపునకు దారితీశాయి ఇది కాకతాళీయం కాకపోవచ్చు.

కానీ,

ఎమ్మెల్యే గారబ్బాయి ఖరీదైన రక్తం, యాద్గిరి పేద ఒకే గ్రూపు కావడం మాత్రం కాకతాళీయమే.